
# అతి జాగ్రత్త

– సూర్య ప్రసాదరావు




రాంబాబు కనిపించకుండా పోయి వారం రోజులు.

ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాలు వచ్చి కూడా సరిగ్గా వారం రోజులే!

సెంచరీ చేస్తాడనుకున్న బ్యాట్స్‌మన్ 'డకౌట్' అయితే ఎంత నిరుత్సాహ పడిపోతారో అంత నీరసపడిపోయారు... అక్కా బావలు. రాంబాబు కనిపించకుండా పోయిందగ్గర్నుంచి.

రాంబాబు అక్కకు ఒక్కగా నొక్క సంతానం. ఎన్ని నోములు నోచిందో... ఎన్ని వ్రతాలు చేసిందో. ఎన్ని చెట్లకు పుట్లకు మ్రొక్కిందో. పెళ్ళయిన పదేళ్ళకుగానీ రాంబాబు కడుపులో పడలేదు. అదీ... భద్రాద్రికి వెళ్ళి వచ్చిన శుభ సందర్భంలో సరిగ్గా శ్రీరామనవమినాడే పుట్టాడు. అందుకే రాంబాబు అయ్యాడు. వాడంటే అందుకే అక్కకు అంత మక్కువ!

చిన్నప్పటి నుంచీ వాడు ఆడింది ఆట. పాడింది పాట! వాడు కోరితే కొండమీద కోతి నైనా తెచ్చివ్వవలసిందే! అయినా వాడికి చదువులో అంత శ్రద్ధ కలగలేదు వాడి అశ్రద్ధ చూసి బావకు జాగ్రత్త కలిగింది.


స్కూల్లో చదువుకుంటున్న దగ్గరనుండే వాడు 'మమ్మీ' అంటే అక్క పరవశించి పోతుంది. 'డాడీ' అంటే బావ పులకించి పోయేవాడు.

కలసి వచ్చే కాలంవస్తే నడిచివచ్చే పిల్లలు పుడ తారన్నట్టు వాడు పుట్టిందగ్గర్నుంచి అదృష్టం కలసి వచ్చింది. బావ కాంట్రాక్టులు మూడు రోడ్లు, ఆరు బిల్డింగ్‌లయ్యాయి. అంతంత మాత్రంగా వుండే ఆర్థిక పరిస్థితి అందలం ఎక్కించింది.

పెద్దగా చదువుకోక పోయినా అక్కా బావలు రాంబాబును, గొప్పగా చదివించాలనుకున్నారు.

"అక్కా! వాడు ఇంటర్‌కు వచ్చేటప్పటికి మా కాలేజీలో చేర్పించక్కా" వాడికి ఎంతో కాలంగా చదువు చెప్పాలన్న కోరిక బహిర్గతం చేశా.

"ఎందుకులేరా! మీ కాలేజీలో తెలుగు, ఇంగ్లీషు




కలిపి చెబుతారటగా" అక్కకున్న కొద్ది పరిజ్ఞానం నా పరధ్యానాన్ని పారద్రోలింది.

"అని నీ కెవరు చెప్పారక్కా?" వుండబట్టలేక అడిగేశా.

"ఎవరు చెప్పేదేమిట్రా? ఊరంతా తెలిసిన విషయమేగా. పూర్తిగా ఇంగ్లీషులో పాఠాలు చెప్పలేక తెలుగులో చెబుతారంటగా" ఎంత చులకనగా అంది.

తెలిసీ తెలియని వయసు, విరిసీ విరియని మనస్సు, పదవ తరగతి నుండి ఇంటర్మీడియెట్ లోనికి వచ్చిన విద్యార్థి మనసు. ఎంతో నేర్చుకోవాలనే తపన! ఎంత నేర్చుకున్నా తనివి తీరని దాహం! అటువంటి వయసులో తెలుగు మీడియం లోనుంచి ఇంగ్లీషు మీడియంకొస్తే క్రొత్తలో 'అన్నప్రాసననాడు ఆవకాయ' పెట్టినట్లుంది. అందుకే వారికి అర్థమయ్యేలా ఇంగ్లీషు మీడియాన్ని అవగాహన చేసి, అలవాటుచేసి క్రమేపీ తెలుగును అంతర్థానమయ్యేలా చూడడం అనుభవజ్ఞుడైన అధ్యాపకుడు చేస్తాడు. ఇదంతా అక్కకు చెప్పినా అర్థం కాదు.

"అందరూ నీ కొడుకుల్లా కాన్వెంటులో చదవరుగా! అందుకనే తెలుగులో కూడా అవసరమైన ప్పుడల్లా చెబుతుంటాం"

నా సమాధానానికి సంతృప్తి చెందినట్టు కనిపించి మరీ అంది "అందుకేరా వాడిని మీ కాలేజీలో చేర్పించనంది"

"ఎలా చేర్పించమంటావురా?" అప్పుడే వచ్చిన బావ అందుకున్నాడు. "క్లాసులు జరగవు. క్లాసుకు ఐదారుగురు వస్తే 'అంత తక్కువ మంది వస్తే... మిగిలిన వాళ్లకు మళ్లీ చెప్పాల్సి వస్తుంది. ఇప్పుడు క్లాసెలా తీస్తామోయ్' అంటూ ఎగనామం పెట్టే వారు కొందరు. అవునా... కాదా... చెప్పు"

"బావా నువ్వు చెప్పింది పూర్తిగా నిజమూ కాదు. అబద్ధమూ కాదు! కానీ సిన్సియర్‌గా పాఠాలు చెప్పేవాళ్ళు లేరా... క్లాసులు కాన్సిల్ చేయకుండా సంతృప్తిగా సిలబస్‌లు పూర్తి చేసేవాళ్ళు లేరా... వున్నారు. కానీ వాళ్ళు నీ లెక్కలోకి రారు."

"ఎలా తీసుకోమంటావోయ్? కాలేజీ టైమంతా కాలేజీలో గడిపేవాళ్ళు ఎందరుంటారు? నీలాంటి వాళ్ళు కొద్ది మంది తప్ప!"

"కాలేజీలో వుండటం వేరు బావా? క్లాసులు తీసుకోవడం వేరు బావా! గత పదేళ్ళుగా నా డిపార్ట్‌మెంట్‌నే చూస్తున్నా గదా... అందరూ రెగ్యుల

*WITH BEST COMPLIMENTS FROM*

# SUN PAPER MILL LIMITED

**('SCHEDULE-1' NEWSPRINT MILL)**

NOW WE ARE PROUDLY MANUFACTURING QUALITY NEWSPRINT. ALL LEADING NEWSPAPERS, WEEKLIES AND MAGAZINES IN INDIA ARE USING OUR NEWSPRINT (SUNPRINT) PAPER. OUR RATES ARE COMPARATIVELY CHEAPER THAN OTHER INDIGENOUS NEWSPRINTS.

**REGISTERED OFFICE**
No. 46, E.V.K. SAMPATH ROAD
MADRAS-600 007
PHONE
588203 AND 588204

TELEX: 0418645 SUN IN

**FACTORY**
POST BAG NO.2, CHERANMAHADEVI-627 414, TIRUNELVELI DISTRICT
PHONE
STD. CODE: 04634
MUKKUDAL: 74529, 74549 AND 74559
TELEX: 433-226 SUN IN
FAX NO: 04634- 60166

ర్గా క్లాసులు తీసుకుంటారు. టైముకు క్లాసుకు వెళ్తారు. ఎప్పుడో తప్ప కాన్సిల్ చేయరు. అనారోగ్యంగా వుంటేనో... ఎమర్జెన్సీ వస్తేనో తప్ప క్లాసు కాన్సిలవదు"

"నువ్వేమీ చెప్పక్కరలేదు. ఎంతో మంది కాలేజీ టైములోనే బయట కనిపిస్తూవుంటారు. ఏదో వ్యాపకం చూసుకుంటూనో... ఏదో వ్యాపారం చేసుకుంటూనో! ఒకప్పుడు 'బ్రతక లేక బడి పంతులు' అనేవాళ్ళు ఇప్పుడు 'బ్రతకటానికే బడిపంతులు' అంటారు."

"క్లాసులు పూర్తిగా జరగడం లేదనడంలో ఎంత నిజం లేదో... క్లాసులు పూర్తిగా జరుగుతున్నాయనడంలో కూడా అంతే నిజం లేదు. జరుగుతున్న క్లాసులకు ఎందరు విద్యార్థులు వస్తున్నారో నన్ను చెప్పమంటావా. నలభై నుండి అరవై శాతం. విద్యార్థి సక్రమంగా కాలేజీకి వస్తున్నాడా... లేదా... అని తల్లి దండ్రులు పట్టించుకుంటేగదా! ఈ రోజు వచ్చినవాడు మర్నాడు రాడు. అంతకు ముందు జరిగిన క్లాసులో సిలబస్‌ను కంటిన్యూ చేస్తుంటే చాలా మంది బ్లాంక్ ఫేస్‌లు పెడతారు. పాత పాఠమే చెబితే విన్న విద్యార్థి మొహం చిట్లిస్తాడు. అందుకే సిన్సియర్‌గా ఫీలయ్యే అధ్యాపకుడిలో అనాసక్త బీజాలు మొలకెత్తడం మొదలు పెడతాయి. క్రమేపీ అవి వ్రేళ్ళునాటి శాఖోపశాఖలుగా విస్తరించాయో ఆచార్యుడే అనాచార్యుడైపోతాడు. అయినా నీ ఒక్కగానొక్క కుమారుడి గురించి ఎన్నిసార్లు వాడి 'స్కూల్లో వాకబు చేశావో చెప్ప"

బావ సమాధానం చెప్పడానికి వెదుక్కో వలసి వచ్చింది.


"చదువు విలువ తెలిసిన నువ్వే పట్టించుకోకపోతే... నిరంతరం సమస్యలతో, బ్రతుకు తెరువు వెతుకులాటలో వెంపర్లాడే ఎందరు పిల్లల చదువుల గురించి పట్టించుకో గలుగుతారంటావ్. కనీసం పదిహేను రోజులకో, నెలకో కాలేజీకి వచ్చి వాడి అటెండెన్స్ గమనించి చెప్ప, చేతల్లో వుంచారనుకో... విద్యార్థి జీవితం క్రమపరచబడుతుంది. అప్పుడు అధ్యాపకుడి పాత్ర సులభమౌతుంది. ఎంతయినా మాతృదేవోభవ... పితృదేవోభవ... తరువాత ఆచార్య దేవోభవ!"

నా మాటలకు మిన్నకుండి పోయిన బావను చూసి అక్క వంటింట్లో కి వెళ్ళిపోయింది.

"హలో! అంకుల్" అప్పుడే స్కూలు నుండి వచ్చినట్లున్నాడు రాంబాబు.

"మామయ్యా అనలేవురా!" ముద్దుగానే కసురుకున్నా.

'అంకుల్' అన్నపదం వినగానే ఒకరకమైన నిర్లిప్తతా భావం! ఏ పిల్లవాడి నోట విన్నా 'మమ్మీ' 'డాడీ' తప్పితే మూడో పదం 'అంకుల్' నాలుగో పదం 'ఆంటీ'.



మొన్నటికి మొన్న మా ప్రక్క వాటా కాన్వెంట్ పాప తల్లితో చెబ్తోంది 'మమ్మీ... మమ్మీ బెగ్గర్ అంకుల్ వచ్చాడే'అని!

నవ్వాలో... ఏడవాలో అర్థం కాలేదు.

"కాళ్ళూ, చేతులూ కడుక్కోరా... టిఫిన్ చేద్దువుగానీ!" వేడివేడి ఉల్లిపాయ పకోడీల ప్లేట్లు మా ముందుంచుతూ అక్కయ్య అంది.

"హాయ్! ఆనియన్ పకోడా!" గబుక్కున ఒకటి నోట్లో వేసుకుని లోపలకు పరిగెత్తాడు.

"ఉదయం తొమ్మిదింటికి యింత తిని, కాలేజీకో, స్కూలుకో వెళ్తే ఈ వేళకు రావడం! మళ్ళీ అరగంటలో ట్యూషన్‌కు తయారు. తిరిగి యింటికి వచ్చేది తొమ్మిదింటికే."

"మరి వాడికి ఆటా పాటా... టైమెక్కడా లేదే?" సందేహం వెలిబుచ్చా.

"మీ అక్క వాడిని ఆడుకోనిస్తుందా! ఇరవై నాలుగు గంటలు చదువే చదువు" ఆమెను బావ దెప్పి పొడిచారు.

"పెద్ద మీరు మాత్రం ఆడుకోనిచ్చినట్లు! వచ్చింది మొదలు వాడిని ట్యూషన్ దగ్గర వదిలి పెట్టడం. తిరిగి తీసుకు రావడం ఆయన పనేగా!"

"అయితే బావా కొంతకాలానికి మీ బండ చాకిరీకి అతీతమై పోయి నిర్లిప్తంగా తయారౌతాడేమో?"

"పోనీ లేరా! ఎలాగూ టెంత్ క్లాసేగదా! ఒక్క సంవత్సరం కష్టపడితే సమ్మర్ ఆట విడువు" అక్క మాటల మధ్యలోనే వాడు వచ్చేశాడు.

అంతలోనే పబ్లిక్ పరీక్షలు. స్పాట్ వాల్యుయేషన్. సమ్మర్ హాలిడేస్!

రాంబాబు టెంత్ క్లాస్ సెకండ్ క్లాసులో పాసయినట్లు, అప్పడే ఇంటర్ ట్యూషన్ చెప్పిస్తున్నట్టు తెలిసింది.

"ఎక్కడా ఎడ్మిషన్ దొరకకుండా, సీటు వస్తుందో రాదో తెలియకుండా, అప్పడే వాడికి ఇంటర్ కోచింగా!"

ఒక్కసారి బావను యింటి దగ్గర అడిగేశాను.

"వాడికి సైన్స్ చదివే తెలివి తేటలు లేవా?"

"లేవని కావు బావా! వాడికి సీటు వస్తుందో రాదో తెలియకుండా. అందులో రిజర్వేషన్లు ఫస్టు క్లాసు వారికే వస్తుందో... రాదో తెలియని పరిస్థితి."

"సీటు రాకపోతే డబ్బు పారేసి కొంటామోయ్! మీ బోడి కాలేజీలో రాకపోతే మరి ఎక్కడారాదా! ఎన్ని వేలు పోసయినా వాడిని ఎం.పి.సి. చదివిస్తా" అహంకారం బావ గొంతులో ఘీంకరించింది.

"సరే చేర్పిస్తావ్! అయినా ఇప్పటి నుండే వాడికి కోచింగ్ ఎందుకు? చదువుకోవడానికి సంవత్సర కాలం వుంది. సిలబస్ వుంది. విభజించి చూపించే టీచింగ్ ప్లాన్లు వున్నాయి. అర్థం కానప్పడే ట్యూషన్ చెప్పించవచ్చుగా."

"సమ్మరంతా ఖాళీయేగా... ఇప్పటి నుంచి చెప్పిస్తే 'అధికస్య అధికం ఫలం' అన్నారు. కాలేజీలో మరో మారు వింటాడు. చదువుకుంటాడు. ఈమారు రాంక్ హోల్డరౌతాడు"

అనుకున్నట్టు వాడికి సీటు ఎక్కడా దొరకక పోతే... నేనే ప్రిన్సిపాల్‌ను మొగమాట పెట్టి మా కాలేజీలోనే సీటు ఇప్పించాను. కానీ వాడి షిఫ్ట్ వేరు. నా షిఫ్ట్ వేరు. నేను వెళ్ళే టైము, వాడు వచ్చే టైము. అప్పటికీ నా సైన్సు కోలీగ్స్ అందరికీ చెప్పించి అట్టిపెట్టాను 'వాడి అటెండెన్స్, ప్రోగ్రెస్ ఎప్పటికప్పుడు చెప్పమని!'

తెల్లవారుజామున ఐదు గంటలకే వాడు రోడ్డు మీద కనిపించేవాడు ట్యూషన్‌కి వెళ్తూ. రాత్రి పదింటప్పుడు కనిపించేవాడు సైకిల్ కారేజీ వెనక పుస్తకాలతో. కోచింగ్... స్పెషల్ కోచింగ్. ఇంటెన్సివ్ కోచింగ్‌లతో వాడు కాలేజీలో కనిపించడం మానివేశాడు.

కేవలం ప్రాక్టికల్స్‌కు మాత్రమే వచ్చేవాడు.

అదేమాట బావతో అంటే...

"మీరు చెప్పే చదువుకు కాలేజీకి రావాలా! ఆ కోచింగ్ సెంటర్ వాళ్ళే బాగా చెబుతున్నారు. ప్రాక్టికల్స్‌కు వస్తున్నాడు. ఎవరు చెప్పినా అదేగా"

"అది కాదు బావా! తల్లిపాలు తల్లిపాలే... డబ్బా

పాలు డబ్బాపాలే! ఓ క్లాస్‌రూం వాతావరణం... ఒకటికి రెండుసార్లు అరటి పండు ఒలిచి పెట్టినట్టు విజ్ఞాన శాస్త్ర రహస్యాలు చెప్తే ఉపాధ్యాయులూ... అటువంటి క్లాసులు వదిలిపెట్టి కోచింగ్ సెంటర్‌లు అలవాటు చేసిన నిన్ననాలి! మంచిది... వాడూ... వాడి భవిష్యత్తు నీదీ... అక్కదీ!"

విసవిసా వచ్చేశాను.

ఫస్టియర్ పరీక్షల్లో వాడు మూడు పరీక్షలు తప్పాడు.

రెండో సంవత్సరం వాడి క్రమశిక్షణా రాహిత్యం పెరిగిపోయింది. ప్రాక్టికల్స్‌కు కూడా అడపా తడపా వచ్చేవాడు. ఎప్పుడు చూచినా సైకిల్ కారేజీపై పుస్తకాలు, ప్రక్క స్నేహితులు.

ఒకసారి నేను వెళ్ళే టైముకే వాడు కాలేజీకి వస్తుంటే నిలదీశా!

"రాంబాబూ! ఇంత ఇర్రెగ్యులర్ అయితే ఎలారా? అటెండెన్స్ షార్టేజీ వచ్చి నిన్ను పరీక్షకు పంపించ కపోతే... ఇంతా పడిన శ్రమా వృధాయేగా?"

"ఏమీ వృథా కాదు మామయ్యా... యూనియన్ ఎలాగూ వుందిగా! నలుగురితో బాటు నారాయణా. గుంపులో గోవిందా! అయినా ఫస్టియర్ పరీక్షలకు చదువుకోవాలి. అందుకే రావడం లేదు. వస్తామావయ్యా . ట్యూషన్‌కు టైమయింది"

అప్పడే వీడికి అన్నిదారులూ తెలిసిపోయాయన్న మాట!

ప్రాక్టికల్స్‌కు వచ్చిన ఎగ్జామినర్స్‌తో నా పరిచయం రాంబాబుకు ఇతోధిక సహాయం చేసింది. ఆ తరువాత థియరీ పరీక్షలు... సమ్మర్ హాలిడేస్... స్పాట్ వాల్యుయేషన్!

ఇంటర్ పరీక్షా ఫలితాలు ప్రకటించబడ్డాయి.

ఆకాశంలో విహరించుతున్నామనుకున్న అక్కా బావలు అథఃపాతాళానికి విసిరేసినట్టు ఫీలయ్యారు వాడి నంబరు పేపర్లో కనిపించకపోయేసరికి!

పేపర్లో ప్రకటన ఇచ్చారు. సమీప పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ ఇచ్చారు. తెలిసిన వాళ్ళ ఇళ్ళన్నీ తిరిగి వచ్చారు. దగ్గర బంధువులకీ, స్నేహితులకీ ఎస్.టి.డి.లు చేశారు. దూరవు వారందరికీ లెటర్స్ వ్రాశారు రాంబాబు ఎక్కడ కనిపించినా ఇన్ఫర్మేషన్ ఇవ్వమని. వాతావరణమంతా అలర్ట్ చేయబడింది.

అక్క దిగులుతో సరిగా భోజనమే చేయడం లేదు. బావ అన్యమనస్కంగా వున్నాడు.

వచ్చేవారు, పోయేవారు, పరామర్శించేవారు, సానుభూతి చూపేవారు, సహాయం చేస్తామని వాగ్దానం చేసేవారు...

రోజులు గడిచిపోతున్నాయి.

ఓరోజు కాలేజీ అడ్రస్‌కు నా పేర వచ్చిన రిజిష్టర్




పోస్టు చూద్దును గదా..."ఫ్రం రాంబాబు" అని వుంది.

ప్రిన్సిపాల్‌గారి పర్మిషన్ తీసుకొని సరాసరి అక్క దగ్గరకు వచ్చేశాను. సమయానికి బావ కూడా ఇంట్లోనే వున్నాడు.

రిజిష్టర్ కవరు అందించాను.

బావే చించాడు... చదవలేకపోతున్నాడు.

"నువ్వే చదవరా అబ్బాయ్! మీ అక్కయ్య కూడా వింటుంది."

"ప్రియాతి ప్రియమైన మామయ్యకు,

తెలుగులో ఎలా మొదలుపెట్టాలో తెలియడం లేదు. ఎంతైనా ఇంగ్లీషు మీడియం స్టూడెంట్‌ను గదా! నేనూ, సతీష్, హరీష్, రమేష్ నలుగురం క్షేమంగా వున్నాం."

"సతీష్, హరీష్, రమేష్ అంటే..."

"వాళ్ళు వాడి క్లాస్‌మేట్స్. ట్యూషన్ మేట్స్. నలుగురూ తప్పారు" బావ విశదపరచాడు.

"నలుగురం ఇక్కడ హోటల్లో వుంటున్నాం. వాళ్ళు తెచ్చిన డబ్బుతోనే బ్రతుకుతున్నాం. పేపర్లో మీ ప్రకటన చూచి నీ పేర కాలేజీ అడ్రసుకు లెటర్ వ్రాస్తున్నాను.

'మామయ్యా! ఉదయం ఐదుగంటలకు నిద్ర లేచి ఆదరాబాదరా పుస్తకాలను తీసుకుని ట్యూషన్‌కు వెళ్తే... కూర్చోడానికి ఖాళీ లేక నిలుచునే నోట్సు రాసుకుంటూ, వింటూ... ఓ ట్యూషన్ తరువాత మరో ట్యూషన్ తిరుగుతూ... ఇంటికి వచ్చేటప్పటికే నీరసం ఆవహిస్తే టిఫిన్ చేసి కాలేజీకి బయలుదేరేసరికి నిద్ర వచ్చేది. అందుకే ఫ్రెండ్ రూంలో పడుకునేవాడిని. మెలుకవ వస్తే ప్రాక్టికల్స్! లేకపోతే సరేసరి!

మళ్ళీ సాయంత్రం అయిదు గంటలకల్లా ట్యూషన్. రాత్రి పదింటిదాకా ఒకరి ఇంట్లో రెండు కాళ్ళ మీద నిలబడితే; ఒకరి ఇంట్లో ఒక పీర ఆనించి కూచుని; ఒకరి ఇంట్లో ఒక కాలి మీద నిలబడి ట్యూషన్ చెప్పించుకొని స్పెషల్ కోచింగ్ బాచీలోనో, ఇంటెన్సివ్ కోచింగ్ బాచీలోనో కూర్చోవడం తప్ప ఇంకేమీ లేదు జీవితంలో...

అందుకనే మెలకువగా వున్నా... నిద్రపోతున్నా పీడకల వచ్చేది. క్షణం తీరిక లేదు. ఓ పాట లేదు. ఓ ఆట లేదు. ఓ సినిమా లేదు. ఓ షికారు లేదు. అందుకే క్లాసులు ఎగ్గొట్టి సినిమాలు చూసేవాడిని.

నాన్న సంగతి తెలుసుగదా! నీ ముందే కాలేజీని, లెక్చరర్లను తిట్టేవాడు. నాకు ఎలా వుంటుంది. అందరూ చేతకాని వాళ్ళే అనుకునేవాడిని. కానీ మామయ్యా... ఇప్పుడు అర్థమౌతోంది. నువ్వు అనేవాడివి... తల్లిపాలంటే తల్లిపాలే! ఓ క్లాస్ రూంలో అంతమంది విద్యార్థులతో నేను కలిసి కూర్చున్నది ఎప్పుడు? కమ్మగా పాఠం వింటే, ఒక్కసారి చదివితే చాలని చెప్పేవాడివి. అదే నిజం! అందుకే దృశ్య శ్రవణ విద్యావిధానం ప్రవేశపెడుతున్నారు.

నేను పగలూ రాత్రి ట్యూషన్ చదివి నేర్చుకున్న విద్యా ఫలితం చూశావుగా! అన్ని సబ్జెక్టులు తప్పాను. అందుకనే అందరి నుండీ తప్పించుకు వచ్చేశాను. మా నలుగురిదీ ఒకే జాతి.

'మేం తిరిగి ఇంటికి రావాలంటే మావీ షరతులు!

మాకు ట్యూషన్లు చెప్పించరాదు. ట్యూషన్లకు వెళ్ళమని బలవంతం చేయరాదు. కాలేజీకి వెళ్ళనివ్వాలి. సాయంకాలం హాయిగా ఆడుకోనివ్వాలి. మా చదువును మేమే చదువుకోనివ్వాలి. ఇరవై నాలుగు గంటలూ 'చదువూ.... చదువూ' అని పోరు పెట్టకుండా వుండాలి. మా లీజర్ అవర్స్ మాకు వదిలి వేయాలి. మా భవితవ్యం తీర్చిదిద్దుకునే బాధ్యతా స్వాతంత్ర్యం మాకు ఇస్తే... ఇస్తామని పేపర్ ప్రకటన ఇస్తేనే మేము తిరిగి వస్తాం. పోస్టల్ స్టాంపును బట్టి ఎవరు వచ్చినా మీకు కనిపించం.

మాకు ట్యూషన్లు చెప్పించమని హామీ ఇస్తారనీ...

మా సమ్మర్ సెలవులు మాకే అప్పగించి వేస్తారనీ...

మళ్ళీ రెండవ సంవత్సరం ఇంటర్‌లో అడ్మిట్ చేస్తారని ఆశిస్తూ....

అమ్మా నాన్నలకు నమస్కారాలు చెప్పాలనిపించడం లేదు.

ఉంటాను మామయ్యా...

నీ... రాంబాబు"

ఉత్తరం పూర్తి చేసి బావ ముఖం చూద్దును గదా... కత్తి వేటుకు నెత్తురు చుక్క లేదు. అక్క ముఖంలో తీవ్రమైన భావ సంఘర్షణ!